క్లుప్తంగా

దివీస్ లేబొరేటరీ యూనిట్‌కు అవార్డు



దివీస్ ప్రతినిధి మహేంద్రకు అవార్డు అందిస్తున్న మంత్రి సత్యకుమార్

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలోని దివీస్ లేబొరేటరీ యూనిట్‌కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆదివారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మక 'కార్ల్ ల్యాండ్‌స్టైనర్ అవార్డు' లభించింది. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా దివీస్ ప్రతినిధి మహేంద్ర ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ వై.ఎస్. కోటేశ్వరరావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా దివీస్ ఏటా వెయ్యి యూనిట్లకు పైగా రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల ద్వారా రక్తగ్రహీతలకు అందిస్తోందని తెలిపారు. తమ సంస్థ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్నపన తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అగ్రహారం ప్రీమియర్ లీగ్ విన్నర్స్ పోలమాంబ లెవెన్స్

తగరపువలస: గత 20 రోజులుగా జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు జేవీ అగ్రహారంలో జరిగిన అగ్రహారం ప్రీమియం క్రికెట్ లీగ్‌ను సంగివలస పోలమాంబ లెవెన్స్ జట్టు గెలుచుకుంది. మండల స్థాయి ఈ క్రికెట్ పోటీలలో తాళ్లవలస జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.30 వేలు బహుమతులతో పాటు ట్రోఫీలను వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని మంగరాజు, కోరాడ రమణ, జీరు కైలాస్ చేతుల మీదుగా అందజేశారు.

రోగులకు హోమియో మందుల పంపిణీ

భీమునిపట్నం: భీమిలిలో కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం జరిగింది. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 90 మంది రోగులు పాల్గొన్నారు. వైద్యులు టి. జగన్నాథరావు, టీజే. మోహన్ రోగులను పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్. మూర్తి, చంద్రశేఖర్, సభ్యులు రాంబాబు, శ్రీనివాసరావు, శంకర్, రాము, కిశోర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: 'హరే కృష్ణ, హరే రామ' నామస్మరణతో సాగరనగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను పఠించి, పలు ప్రవచనాలు ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కీర్తనలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం

తగరపువలస : త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆనందపురం మండలం గిడిజాల, వేమగొట్టిపాలెం, ముచ్చర్ల గ్రామాల్లో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కె. త్రినాథరావు మాట్లాడుతూ త్వరలో రానున్న గురుపౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం, భగవద్గీత గ్రంథాల గురించి వివరించారు. గుణాతీతుడు, రూపవర్జితుడు, గుణముల మలినములు లేనివాడే నిజమైన గురువు అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాజు, భవాని, ఎస్. అచ్చయ్యమ్మ, వి. సురేష్, సంతోష్, లక్ష్మి, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో విషసర్పాల బెడద

చుట్టూ దట్టమైన పొదలు

భయాందోళనలో కాలనీవాసులు



ఈఎస్ఐ ఆస్పత్రి ప్రహరీ మీదుగా తుప్పలు



టీచర్స్ కాలనీ మధ్య ఖాళీ స్థలాలలో మొలిచిన తుప్పలు



చీకటి పడితే జాతీయరహదారి నుంచి సంతపేట మీదుగా విషపురుగులతో కూడిన రహదారి



జాతీయరహదారిని ఆనుకుని ఖాళీ స్థలాలలో తుప్పలు



వర్షాలకు ప్రహరీల మధ్య తుప్పలు



ఆటోలు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి



ఇంటికి వెళ్లాలంటే తుప్పల మధ్య కాలిబాటలే శరణ్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని రెండో వార్డు పరిధిలో, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న టీచర్స్ కాలనీ నిత్యం విషపురుగుల బెడదతో సతమతమవుతోంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సగానికి పైగా ఖాళీ స్థలాలను వాటి యజమానులు పెట్టుబడుల కింద కొనుగోలు చేసి, ఎలాంటి రక్షణ లేకుండా వదిలేయడం ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కబ్జాకు గురికాకుండా ఉండేందుకు పేరుకే అడుగు మేర ప్రహరీలు నిర్మించినప్పటికీ, వాటి నిర్వహణను పూర్తిగా విస్మరించారని స్థానికులు వాపోతున్నారు.

యజమానుల నిర్లక్ష్యం స్థానికులకు ప్రాణ సంకటంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల చుట్టూ కనుచూపు మేరలో పెరిగిన పచ్చని తుప్పలు, వాటి కింద సంతతి వృద్ధి చేసుకుంటున్న విషపురుగులు స్థానికులను భయాందోళన కు గురిచేస్తున్నాయి. పగటిపూటే ఇళ్లలోకి పాములు, తేళ్లు వంటి విషపురుగులు చొరబడుతున్నాయి. వేసవి ఉక్కబోత కారణంగా గాలి కోసం తలుపులు, కిటికీలు తీసి ఉంచితే, వాటినే రాజమార్గంగా చేసుకుని ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని చెబుతున్నారు.

తరుచూ ఇబ్బందులు

ఈ కాలనీని ఆనుకుని ఉన్న చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి లోపలి నుంచి కూడా టీచర్స్ కాలనీ, ఆదర్శనగర్ ప్రాంతాల వైపు విషపురుగులు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి సంతపేట, టీచర్స్ కాలనీలోని వివిధ వీధులకు రాకపోకలు సాగించే స్థానికులతో పాటు, ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థినులు, మహిళా ఉద్యోగుల కాళ్ల కింద తరచూ విషపురుగులు పడుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి జీవీఎంసీ శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలు సంయుక్తంగా పనిచేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విషపురుగుల ఆనవాళ్లు లేకుండా పచ్చని తుప్పలను వారే తొలగించడమో, లేదా స్థల యజమానులే తొలగించుకునేలా ఆదేశాలు జారీ చేయడమో చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ తక్షణమే దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి



టీచర్స్ కాలనీ చుట్టూ విషపురుగులే. ఎప్పుడు విష సర్పం ఇంట్లో దూరుతుందో భయాందోళన చెందుతున్నాం. పిల్లలు ఆడుకోవడానికి కూడా భయపడే పరిస్థితి ఉంది. విషసర్పాల బెడద నుంచి జీవీఎంసీ అధికారులే కాపాడాలి.

– కంచుబోయిన సురేష్, టీచర్స్ కాలనీ

కాలనీ చుట్టూ పొంచి ఉన్న ప్రమాదాలే..

జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని టీచర్స్ కాలనీని చుట్టూ ఉన్న పరిసరాలు విషపురుగులు, జలగలకు నిలయంగా మారాయి. కాలనీకి తూర్పు వైపున ఎర్ర చెరువు, నల్లకోనేరు, పెద్ద చెరువు, పడమటి వైపున సంగివలస చెరువు ఉన్నాయి. అలాగే ఉత్తర దిక్కున చెట్లతో నిండిన ఈఎస్ఐ ప్రహరీ, దక్షిణ వైపు మామిడి తోటలు, పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు విస్తరించి ఉన్నాయి. రెండో వార్డులో అత్యధిక ఖాళీ స్థలాలు, దట్టమైన తుప్పలు ఉన్న కాలనీ ఇదే కావడం గమనార్హం. ఈ పరిసరాల కారణంగా, విషపురుగులు కేవలం రోడ్డు మార్గంలోనే కాకుండా, డ్రైనేజీలు, ఖాళీ ప్రదేశాల నుంచి కూడా కాలనీలోకి ప్రవేశిస్తున్నాయి. అంతేకాకుండా, చుట్టూ ఉన్న చెరువుల నుంచి డ్రైనేజీల ద్వారా జలగలు కూడా ఇళ్లలోకి వస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల మధ్య విషపురుగులు, డ్రైనేజీలలో జలగలు పెరగకుండా ఉండేందుకు తుప్పలను తొలగించి, రసాయనాలు పిచికారి చేయించాలని స్థానికులు జీవీఎంసీని కోరుతున్నారు. అంతేకాకుండా, ఖాళీ స్థలాల యజమానులు కూడా తమ స్థలాలను స్వయంగా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే, రాబోయే వర్షాకాలంలో ప్రమాద తీవ్రత మరింత పెరుగుతుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

మురికివాడలా ఉంటుంది



టీచర్స్ కాలనీలో ఎక్కువ మంది ఆఫీషియల్సే ఉంటారు. కానీ ఇక్కడ వాతావరణం చూస్తుంటే మురికివాడ కంటే దారుణంగా ఉంటుంది. చిన్న వర్షం పడితే డ్రైనేజీలు నిండిపోతాయి. ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు పెరుగుతాయి. చివరకు ఇళ్లలోకి జలగలు ప్రవేశిస్తున్నాయి.

– నామాల తిరుపతిరావు, విశ్రాంత విద్యుత్ ఉద్యోగి

పాముల బెడద



శనివారం రాత్రి ఓ విష సర్పం ఇంట్లోకి దూరింది. చాలా సేపు వెతికినా కనిపించలేదు. ప్రతిసారి ఇక్కడ ఇళ్లలోకి పాములు దూరడం సహజం. చీకటి పడిన తరువాత రాకపోకలు సాగించే మహిళలు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ చర్యలు తీసుకోవాలి.

– బులుసు వేంకటేశ్వర్లు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర

భవన నిర్మాణ కార్మిక సభల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మధురవాడ : కేంద్రంలోని కూటమి ప్రభుత్వం మోదీ తీసుకువచ్చిన లేబర్స్ కోడ్స్ అమలుకు తలొగ్గిందని, తద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్మికులను బానిసలుగా మార్చడానికి పూనుకున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్‌కే ఎస్‌వీ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం మధురవాడ కృష్ణానగర్‌లోని ద్రోణంరాజు కళ్యాణ మండపంలో సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ 6వ జిల్లా మహాసభలు ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికగా తొలుత జిల్లా సీనియర్ నాయకుడు ప్రకాశరావు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దివంగత నాయకులు పందిరి రాము, సత్యన్నారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం 12 గంటల పనిదినాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తుందని, దీనిని తిప్పికొట్టడానికి కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ ఓట్లేసి గెలిపించిన కార్మికులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పని దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వ విధానాలు వారిని మరింత కష్టాల్లోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ భవంతుల నిర్మాణంలో స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వాటాతో కూడుకున్న పీఎఫ్, ఈఎస్ఐని అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులు నిర్మాణ కార్మికులకే ఖర్చుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభలు ప్రారంభం సందర్భంగా కొమ్మాది జంక్షన్ నుంచి మధురవాడ, నగరంపాలెం రోడ్డు మీదుగా కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని తమ సమస్యలు, ప్రభుత్వ మోసంపై గట్టిగా నినదించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు జ్యోతీశ్వరరావు, పోలేశ్వరరావు, పి.రాజ్‌కుమార్, అప్పలరాజు, ఎస్. రాములప్పడు, కిరణ్, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో పర్యాటకుల తాకిడి



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: ఆదివారం సెలవు కావడంతో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు పర్యాటకుల సందడితో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బీచ్‌లు, ఇతర ఆకర్షణలు సందర్శకులతో కళకళలాడాయి. ముఖ్యంగా భీమిలి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, కోకోనట్ ఎరినా బీచ్, రామాద్రి బీచ్, తొట్లకొండ, బావికొండ, రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులు బీచ్‌లలో ఆడుకుంటూ, ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గడిపారు. ఆహ్లాదకరమైన వాతావరణం, సముద్ర తీర అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం



టీటీడీ ఆలయ ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

కొమ్మాది: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీవారి సేవకులు, భక్తులు, హెచ్‌డీపీపీ సభ్యులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ, ఇంజినీరింగ్ సిబ్బందితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరికీ కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు హిమాన్ ప్రసాద్ అల్పాహారం ఏర్పాటు చేశారు.

దేశాభివృద్ధికి యువత పాటుపడాలి



ప్రీమియర్ లీగ్-1 పోటీల ప్రారంభం సందర్భంగా క్రీడాకారులతో సిరి సహస్ర

తగరపువలస: యువత విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ సమాజానికి, దేశాభివృద్ధికి పాటుపడాలని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె చిట్టివలస బంతాట మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ సీజన్ 1 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరి సహస్ర తొలుత టాస్ వేసి స్వయంగా బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడల్లో ప్రతిభ ఉన్నవారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆమె అన్నారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి, జీరు వెంకటరెడ్డి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు, పందిరి విజయ్, వెంపాడ వెంకటరమణ, జీరు శ్రీనివాసరెడ్డి, సిమ్మల ప్రసన్న, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.

సంగీతసేవ



శ్రీకృష్ణ గానామృతం చేస్తున్న కళాకారులు

తగరపువలస : ఆనందపురం మండలం, గంభీరం, ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మదన మోహన మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన శ్రీకృష్ణ అర్పణం భక్తి వేడుకలో భాగంగా సంగీత సేవ నిర్వహించారు. నగరానికి చెందిన సామవేద మ్యూజిక్ అకాడమీ శ్రీవారాహి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు శ్రీకృష్ణ లీలలను పాటల రూపంలో అద్భుతంగా గానం చేశారు. శాంతిశ్రీ, అభ్యుదయ, పంపాన కామేశ్వరి, బొమ్మన భరత మాత, ఆలవెల్లి ప్రశాంతిరాజ్, దంతులూరి పద్మజ, చైతన్య తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం జరగనున్న ఈ శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 95425 11108 నంబరులో సంప్రదించాలని హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం : పద్మనాభం, బోని సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు మరమ్మతులు చేపట్టనున్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జగన్మోహన రావు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనాభం, కృష్ణాపురం, రెడ్డిపల్లి, శేరిఖండం, పొట్నూరు, తునివలస, నరసాపురం, చిన్నాపురం, నేరేళ్లవలస, విజయానందపురం, మద్ది, బాందేవుపురం, విలాస్కాన్‌పాలెం, విజయరాంపురం, కురపల్లి, అనంతవరం, గంధవరం, పెంట, కొవ్వాడ, తిమ్మాపురం, పాండ్రంగి, మనివానిపాలెం, సామయ్యవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. నగరంలోని నృత్య కళాంజలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ నృత్య భంగిమలతో అలరించారు. ఈ ప్రదర్శనలో అశ్వాత సాయి, నివేదిత, నీహిత, మహాలక్ష్మి, నేహ, శ్రీనిధి, తన్వి, భవిష్య తదితరులు పాల్గొనగా, రమ్య నృత్య దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఏఓ రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: రైతాంగానికి తమ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. పద్మనాభంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన రైతులకు విత్తనాలను సరఫరా చేసి, ఏరువాకను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు కలిపి రూ. 38 లక్షల వ్యయంతో నిర్మించిన మండల సమావేశ మందిరం భవనాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్యామల, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామి నాయుడు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఎంపీడీవో ఎం. విజయ్ కుమార్, తహసీల్దార్ కె. ఆనందరావు, ఏవో ఎంవీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి సీపీఐ నాయకుల నివాళులు

తగరపువలస: ప్రముఖ అభ్యుదయ గీతాల రచయిత శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో సీపీఐ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ నగరంలోని ఏవీఎన్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' గ్రంథం విశేష ప్రజాదరణ పొందిందని గుర్తుచేశారు. అలాగే అల్లూరి సీతారామరాజు సినిమాలోని 'తెలుగు వీర లేవరా' పాటకు ఆయనకు జాతీయ స్థాయి అవార్డు లభించిందని తెలిపారు. శ్రీశ్రీకి చిత్రపటం వద్ద భీమిలి ఏరియా సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా ఆకెళ్ల మల్లికార్జున శర్మ జయంతి ఉత్సవం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డులోని సంగివలసలో సంగీత విద్వాన్ ఆకెళ్ల మల్లికార్జున శర్మ 87వ జయంతిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగురురాజా మ్యూజికల్ ఇన్‌స్టిట్యూట్ 11వ వార్షికోత్సవ వేడుకలు కూడా జరిగాయి. ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు వి.సంతోష్‌కుమార్ మ్యూజికల్ లెర్నింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించి, విద్యార్థులకు సంగీత ప్రవేశిక సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన ఆకెళ్ల మల్లికార్జున శర్మ కుటుంబ సభ్యులు నరసింహస్వామి, మనవడు నిరంజన్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

మోదీ పాలనలో సంక్షేమం పరుగులు

పీఎం పాలెం: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన ప్రగతి, ప్రజా సంక్షేమం దిశగా పరుగులు తీస్తోందని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రశంసించారు. 'వికసిత్ భారత్ సంకల్ప సభ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం పీఎం పాలెంలోని కేకే జంక్షన్ హాలులో స్థానిక బీజేపీ అధ్యక్షుడు చోడవరం నాగరాజు ఆధ్వర్యంలో ఈ సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి అడుసుమిల్లి కేశవ కాంత్, పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు కేఎస్‌పీ చక్రవర్తి, 'వికసిత్ భారత్ సంకల్ప సభ' కన్వీనర్ ధానేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.